గుట్టలో వైభవంగా సువర్ణ పుష్పార్చన

యాదగిరిగుట్ట, నవంబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖ మండపంలో గురువారం సువర్ణమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. భక్తులు సువర్ణ పుష్పార్చనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై కల్యాణోత్సవ సేవను జరిపారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. కార్తీక మాసం కావడంతో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు తెల్లవారుజామునే దీపారాధనలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,95,797 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గుట్టలో సీఎం పర్యటనకు ఏర్పాట్లు

యాదగిరిగుట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం సెక్యూరిటీ అధికారి లక్ష్మీకాంతరావు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు తదితరులు

యాదగిరిగుట్ట, నవంబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా రానున్న నేపథ్యంలో జిల్లా, దేవస్థాన అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ముఖ్యమంత్రి సెక్యూరిటీ అధికారి లక్ష్మీకాంతరావు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్ర సీఎం పర్యటన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. కొండపైన వీవీఐపీ అతిథి గృహంలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. అనంతరం స్వామివారి అఖండ దీపారాధన, తూర్పు రాజగోపురం, అద్దాల మండపం, విష్ణుపుష్కరిణితోపాటు కొండ కింద పార్కింగ్ ప్రాంతం, టెంపుల్ సిటీలో హెలిప్యాడ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం ఉదయం 8:45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో చాపర్‌లో యాదగిరిగుట్టకు చేరుకోనున్నారు. ప్రెసిడెన్సియల్ సూట్‌కు వెళ్లి సిద్ధం కానున్నారు. అక్కడి నుంచి నేరుగా కొండపైకి వెళ్లి విష్ణుపుష్కరిణిలో స్నాన సంకల్పం, అఖండ దీపారాధనలో పాల్గొని తూర్పు రాజగోపురం గుండా వెళ్లి స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకోనున్నారు. దర్శనానంతరం తిరిగి ప్రెసిడెన్సియల్ సూట్‌కు వెళ్లి వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

సమగ్ర సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

సమగ్ర సర్వే హౌజ్ లిస్టింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

చౌటుప్పల్, నవంబర్ 7 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ కె.గంగాధర్ అన్నారు. సమగ్ర సర్వేలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో గురువారం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనలో ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

వలిగొండలో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 7 : కుల గణనలో ప్రతిఒక్కరూ తమ పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకొని అధికారులకు సహరించాలని జడ్పీ సీఈఓ ఎస్.శోభారాణి అన్నారు. మండలంలోని చిన్నకొండూరులో చేపడుతున్న కుల గణనను గురువారం ఆమె పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు వేసి ఇండ్ల జాబితా సిద్ధం చేశారు. గ్రామాల పేర్లను కోడ్ రూపంలో సేకరిస్తున్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే పరిశీలన

వలిగొండ : మండల కేంద్రంలోని వేంకటేశ్వర కాలనీలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉపాధి, కుల సమగ్ర ఇంటింటి సర్వేను జిల్లా పరిషత్ సీఈఓ ఎస్.శోభారాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించి కుటుంబ వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆలకుంట్ల శ్రీనివాస్, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగు విస్తరించాలి

- జిల్లా ఉద్యాన, పట్టు శాఖ అధికారి సుభాషిణి

వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 7 : యాసంగిలో ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం పెరుగాలని, తద్వారా పంట మార్పిడి చేయడమే కాకుండా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు శాఖ అధికారి కె.సుభాషిణి అన్నారు. ప్రొఫెసర్ జయంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా ఏరువాక కేంద్రం, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థినుల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని అనాజిపురం రైతు వేదికలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. పట్టణాలకు దగ్గరలో ఉన్న గ్రామాల్లో కూరగాయల సాగుతో నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్ మాట్లాడుతూ యాసంగి వరి నార్లు నవంబర్ 20 నుంచి డిసెంబర్ 20వరకు పోసుకోవాలని సూచించారు. చీడపీడలు ఆశించకుండా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి మాధవి, జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారాణి, శాస్త్రవేత్త సునీత, వివిధ శాఖల అధికారులు మల్లేశ్, శ్రీశైలం, లావణ్య, సతీశ్, అభ్యుదయ రైతులు కంచి మల్లయ్య, మల్లేశ్, చంద్రయ్య, ఏనుగు వెంకట్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికే మూసీ నది పునరుజ్జీవనం

- రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- సీఎం పాదయాత్ర ఏర్పాట్లు పరిశీలన

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్య. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, నవంబర్ 7 : మూసీ నది పునరుజ్జీవనంతోనే ప్రజల ఆరోగ్య, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంగెం భీమలింగం కత్వ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్ర, వివిధ కులవృత్తుల వారితో నిర్వహించే సభ ఏర్పాట్లను గురువారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పాదయాత్రకు ఆటంకాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ మూసీ నది ప్రక్షాళనతోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోదావరి జలాలకు పూజలు

యాదగిరిగుట్ట : మండలంలోని జంగంపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సొంత నిధులతో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటరీ పాయింట్ వద్ద గోదావరి జలాలకు మంత్రులు పూజలు నిర్వహించి దిగువ గ్రామాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగుజలాలు అందించాలని లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మరో రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియను, రూ.800 కోట్లతో గంధమల్ల జలాశయాన్ని పూర్తి చేసి ఆలేరు నియోజకవర్గానికి సాగుజలాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ గూడిపాటి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ చైతన్యారెడ్డి పాల్గొన్నారు.

దేశ్‌ముఖిలో ఘనంగా సదర్ సంబురం

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం సదర్ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ క్రాంతి దళ వ్యవస్థాపకుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత క్యామ మల్లేశం, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి హాజరై యాదవ ప్రముఖులతో కలిసి శ్రీకృష్ణుడికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దున్నపోతులను అలంకరించి డప్పుచప్పుళ్ల మధ్య తీసుకువచ్చారు. దున్నపోతుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సదర్ సంబురాన్ని చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపకుడు పృథ్వీరాజ్‌యాదవ్ మాట్లాడుతూ యాదవులు చైతన్యవంతం కావాలన్నారు. నేటి యువతలో మేథోమదనం జరుగాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో యాదవులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. క్యామ మల్లేశం మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. సదర్ సమ్మేళనంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

కార్యక్రమంలో అంబర్‌పేట శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ దుర్గం స్వప్నానరేశ్, మాజీ ఎంపీటీసీ చిల్లర జంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

మాదాపురంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

మాదాపురంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

తుర్కపల్లి, నవంబర్ 7 : మండలంలోని మాదాపురం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్ర స్థాయి పాఠశాలల కబడ్డీ క్రీడోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మాదాపురం డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో అండర్ – 14, 17 బాలబాలికల జట్లు పాల్గొననున్నాయి. ఉమ్మడి 10 జిల్లాల నుంచి 10జట్లు, అండర్ – 14 బాలికల విభాగంలో 20జట్లు పాల్గొంటున్నాయి. 360మంది విద్యార్థులు ఈ పోటీలకు వస్తుండగా.. ఒక్కో టీమ్‌కు మేనేజర్, కోచ్‌తోపాటు 60మంది అధికారులు ఉన్నారు. ఈ క్రీడలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా నుంచి 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులను నియమించారు. పాఠశాల ప్రాంగణంలో 4 కోర్టులు సిద్ధం చేసి, పగలు, రాత్రి క్రీడలు నిర్వహించనున్నారు. ఈ నెల 9వరకు నిర్వహించనున్న ఈ క్రీడల్లో మొదటి రోజు లీగ్ పోటీలు జరిగాయి. క్రీడాకారులు ఫ్లాగ్ మార్చ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, ఎస్‌జీఎఫ్ స్టేట్ సెక్రటరీ కుంభం రాంరెడ్డి, స్పోర్స్ స్పాన్సర్ వడ్డె జానయ్య, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఎంఈఓ మాలతి, పాఠశాల క్రీడా సమైక్య రాష్ట్ర కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, క్రీడల ఆర్గనైజర్ చింతపండు వెంకటేశం పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు సీపీఎం వ్యతిరేకం : జహంగీర్



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 7 : జమిలి ఎన్నికలను సీపీఎం పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందన్నారు. మతాల పేరుతో దేశ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీజేపీని అడ్డుకోవడమే కమ్యూనిస్టుల ప్రధాన లక్ష్యమని అన్నారు. బీజేపీ పాలనలో దేశంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ వెనుక సీఎం రేవంత్‌రెడ్డితోపాటు బడాబాబుల ప్రయోజనాలు దాగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, నాయకులు జక్కిడి నర్సిరెడ్డి, దోనూరి నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెద్దులు, రాములు, నర్సింహ, అమరేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

రాజాపేట, నవంబర్ 7 : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిశీలించారు. బసంతాపురంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ కిషన్ ఉన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని శారాజీపేటలో ఏర్పాటు చేసిన సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, ఏపీఎం మీనా, ఏఈఓ నాగార్జున, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య పాల్గొన్నారు.

త్రిఫ్ట్, నూలుపై సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలి

భువనగిరి అర్బన్, నవంబర్ 7 : చేనేత కార్మికులకు ఉపయోగపడుతున్న త్రిఫ్ట్, నూలుపై సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలని వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ మాటూరి బాలరాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటనర్సు అన్నారు. పట్టణంలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చేనేత కార్మికులు రోజువారి కూలి పనిలో పొదుపు చేసిన 1200 రూపాయలను, అనుబంధ కార్మికులు రూ.8వందలు చొప్పున ప్రతి నెలా ఆర్డీ–1 బ్యాంక్ ఖాతాలో జమ చేస్తే ప్రభుత్వం ఆర్డీ – 2లో రెండింతలు రూ.4వేల చొప్పున జమ చేసి మూడు సంవత్సరాలకు తీసుకునే విధంగా గత ప్రభుత్వం త్రిఫ్ట్ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఆగస్టులో ముగిసిన ఈ పథకాన్ని పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు జి.నర్సింహ, రాములు, రామచంద్రం, ఆంజనేయులు పాల్గొన్నారు.

బస్సు ఆపలేదని ఆర్టీసీ ఎండీకి ఫిర్యాదు

- బస్సు డ్రైవర్ సస్పెన్షన్

ఆలేరు టౌన్, నవంబర్ 7 : డీలక్స్ బస్సును ఆలేరులో ఆపలేదని ఓ ప్రయాణికుడు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేయగా.. సదరు డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు. ప్రయాణికుడు తెలిపిన వివరాల ప్రకారం.. పసుపునూరి వీరేశం ఈ నెల 2న హైదరాబాద్‌లోని ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద జనగాం డిపోకు చెందిన డీలక్స్ బస్సు ఎక్కాడు. ఆలేరులో ఆపాలని అడుగగా, అక్కడ హాల్టింగ్ లేదు.. ఆపనని డ్రైవర్ చెప్పాడు. ఈ విషయమై ప్రయాణికుడికి, బస్సు డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై వెంటనే తన సెల్‌ఫోన్‌లో బస్సు డ్రైవర్ కేపీ కుమార్‌పై ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారులు విచారణ చేపట్టగా నిజమని తేలింది. దాంతో గురువారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సదరు బస్సు డ్రైవర్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. కాగా, ఆలేరులో డీలక్స్ బస్సులు ఆపాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు, డిపో మేనేజర్‌కు అఖిలపక్ష నాయకులు గతంలో వినతిపత్రం అందజేశారు. దాంతో అక్కడ 40 బస్సులు ఆపుతామని వారు హామీ ఇచ్చారు. కానీ.. రాత్రి పూట బస్సులు ఆలేరు బైపాస్ నుంచి వెళ్తుండడంతో స్థానిక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

వలిగొండ, నవంబర్ 7 : లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని టేకులసోమారం గ్రామ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎగ్గె నవీన్ (24) భువనగిరిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా టేకులసోమారం గ్రామం వద్ద ఎదురుగా వచిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో...

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన బద్దం నర్సింహ (34) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానిక ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి నిద్రపోయిన బద్దం నర్సింహ గురువారం ఉదయం లేవలేదు. దీంతో ఆయన తండ్రి లేపినా లేవకపోవడంతో వెంటనే హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు. నర్సింహ భార్య విడాకులు తీసుకోవడంతో మానసికంగా కుంగిపోయాడని, ఈ క్రమంలో రోజూ మద్యం సేవించేవాడని గ్రామస్తులు తెలిపారు. నర్సింహ తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వవద్దు'

రామన్నపేట, నవంబర్ 7 : మండల కేంద్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ ప్రకటన చేయాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలించారు. కార్యక్రమంలో బోదాసు వెంకటేశం, గర్దాసు సాయికుమార్, గండు అంజయ్య, గ్యార సాలయ్య, మామిడి భిక్షం, తిరుమలేశ్, గ్యార నాగరాజు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే సామేల్

ప్రభుత్వ విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, నవంబర్ 7 : వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించతలపెట్టిన మూసీ ప్రక్షాళన పర్యటనను విజయవంతం చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ విశ్రాంతి భవనాన్ని గురువారం రీ ఓపెనింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ నది నీటి కలుషితం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, ఆ నీళ్లు తాగిన మూగజీవాలు అనారోగ్యం బారిన పడుతున్నాయని అన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

భువనగిరిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే కుంభం

టవర్లకు విద్యుత్ వైర్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 7 : పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి ప్రధాన రహదారిలో బిగించిన టవర్లకు రూ.4.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ వైర్ల పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి వెడల్పుతో వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ వీరేశం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ వీరేశం

ఆలేరు టౌన్, నవంబర్ 7 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన పోరాట కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనలో భాగంగా ఆలేరు రెవెన్యూ డివిజన్ హామీని నెరవేర్చాలని కోరారు. ఎన్నో రోజులుగా తాము చేస్తున్న పోరాటాన్ని గుర్తించకుండా ఇటీవల ములుగును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం శోచనీయమన్నారు. ఆలేరును నియోజకవర్గ కేంద్రంగా లేకుండా చేయడానికి అధికార పార్టీ కుట్రలు చేస్తున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని తెలిపారు. అదే జరిగితే కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. హామీలను నెరవేర్చకపోతే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సాధన కమిటీ కో కన్వీనర్ రాచకొండ జనార్దన్, నాయకులు చెక్క వెంకటేశ్, ఇక్కిరి సహదేవ్, గంగేశ్, సముద్రాల సత్యం, కామిటికారి అశోక్, బాంబే రవి, కుమారస్వామి, మల్లేశం, స్వామి, ఉదయ్ పాల్గొన్నారు.

విద్యుత్ టవర్లకు వైర్ల బిగింపు

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

భువనగిరి అర్బన్, నవంబర్ 7 : పట్టణ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి రూ.9కోట్లతో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయగా.. వాటికి విద్యుత్ వైర్లను బిగించే పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఫ్లెక్సీకి బీఆర్‌ఎస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ భువనగిరి పట్టణ ప్రధాన రహదారి విస్తరణ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితోనే సాధ్యపడిందన్నారు. కొన్నేండ్ల నుంచి పట్టణంలోని తాతానగర్, ఓంకార్‌నగర్, పహాడీనగర్, బంజారాహిల్స్ కాలనీల్లో ఇండ్లపై 33 కేవీ లైన్లు పోవడంతో వాటిని తొలగించేందుకు ప్రధాన రహదారిలో టవర్లను ఏర్పాటు చేయించారన్నారు. రహదారి విస్తరణ, టవర్ల ఏర్పాటు, ఇండ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించే పనులకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎన్నబోయిన ఆంజనేయులు, భగత్, రమేశ్, లక్ష్మీనారాయణ, రఘునాథ్, భిక్షపతి, అజీమ్ పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు



పోలీస్‌స్టేషన్ వద్ద విద్యార్థులతో రాచకొండ సీపీ సుధీర్‌బాబు

బీబీనగర్, నవంబర్ 7 : సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్, స్టాఫ్ పనితీరు, సీసీ టీవీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ సందర్శనకు వచ్చిన బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐ ఎస్.రమేశ్, సిబ్బంది ఉన్నారు.

సంస్థాన్‌లో హైటెన్షన్ వైర్ల సర్వే కలకలం

గుడిమల్కాపురంలో హైటెన్షన్ వైర్ల కోసం సర్వే చేసి వేసిన మార్కింగ్

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 7 : మండలంలోని గుడిమల్కాపురం గ్రామం బ్రిడ్జి వద్ద హైటెన్షన్ వైర్ల కోసం సర్వే చేసి మార్కింగ్ వేయడం కలకలం రేపుతుంది. మండలంలో ఇప్పటికే ఆర్‌ఆర్‌ఆర్ సర్వే మార్కింగ్, స్పీడ్ ట్రైన్ లైన్ కోసం సర్వే, గ్యాస్ పైప్‌లైన్ కోసం గుంతలు తీస్తుడండంతో భూములు కోల్పోతున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో ఎవరి భూములు పోతాయో తెలియక ప్రజలు, రైతులు అయోమయంలో ఉన్నారు.